# జీవనరాగం

అన్నయ్యా వదినా చిలకా గోరింకల్లా ఉంటారనుకుంది రాధ. వాళ్ళని దేవతల్లా చిత్రించుకుంది మనస్సులో. చూడగా చూడగా తన ఊహాలు చిత్రంగా మారుతున్నాయి. అన్నయ్య ఇంజనీరింగు పరీక్ష పాసయేడు; కేవలం మామూలు ఇంజనీరు. వదినా చదువుకుంది. మరేమో అంత ఖెడినిపాటుగ మసలుతున్నారు. వదిన ఏమనుకుంటుందో, కొంచెం లోతుగా అడిగితే మనస్సు తికమక పడింది. అన్నయ్య గదివైపుకు గెండడుగులు వేసింది. ఎదురుగా వదిన కనిపించింది. ఆవిడ ముఖం నలిగిపోయిన పువ్వుల్లా ఉంది. ముఖం తిప్పుకుందుకు ప్రయత్నించింది. రాధ ఆవిడముఖంలోకి చూస్తూ చిరునవ్వు వెలిగించింది, వదిన నవ్వింది. రాధగుండెల్లో చిన్న మతాబు వెలిగింది.

ఇద్దరూ గదిలో ఎంతోసేపు కూర్చున్నారు. ఎప్పుడూ లేని కబుర్లు దొర్లేయి. ఎన్నో విషయాలు స్నేహితులు, సినిమాలు సహితం. అయినా రాధ పెళ్ళగించాలనుకున్న కబుర్లకు వీలు చిక్కలేగు. సరూ సంతోషంగా ఉంది. రాధతో ఇంకా కబుర్లాడా లనుకుంది. అత్తగారి కేకలు పెరట్లోంచి వినిపిస్తున్నాయి. ఇద్దరూ అవతలికి పరుగెత్తేరు.

రాత్రయింది. అందరూ నిద్రపోతున్నారు. రాధకు నిద్ర పట్టడంలేదు. అన్నయ్య గదిలోంచి వెలుతురు వస్తూంది ఇంకా. నెమ్మదిగా కిటికీవైపుకు చేరింది. అన్నయ్య సిగరెట్టు కాలుస్తూ రాసుకుల్లా చూస్తున్నాడు. సరూ ధ్యానంగా చూస్తూ తలుపుదగ్గర్నే కూచునుంది. అన్నయ్య మొహం చూస్తుంటే ఏమో వన్నట్టుగా ఉంది. ఏమైనా అడిగితే ఏం చెప్తాదికి వెనక్కి వెళ్ళిపోయింది భయంగా. ఎటు ఒరిగి నిద్రపోదామన్నా, ఉడుకుతున్న హృదయం కుంపటి కట్టుకున్నట్టుగా ఉంది. కలత నిద్రలో కుమిలిపోయింది. ఎప్పుడు నిద్రపోయిందో తనకే తెలీదు, సరూ తట్టి లేవగొట్టేవరకూ—

"ఏం రాధా నిద్దట్లో ఏడుస్తున్నావేం... ఇటు చూడు..."

"నే... నేం... లేదే" తత్తరపాటుగా లేచింది రాధ.

"ఏదో పాడుకల వచ్చుంటుంది..."

"ఏమో, ఏం కలో, ... బ్రతుకంతా కలే..."

సరూ ఏదో అనబోయి, పెదిమలు కదిపి ఊరుకుంది. రాధను నిద్రపొమ్మని మెల్లిగా కాళ్ళొద్దుకుంటూ బరువుగా నడిచింది. అరే! ఇంకా నిద్రపోలేదే వదిన, అని రాధ మగతలోంచి లేచింది. వదిన అప్పటికే గదిలోకి అదృశ్యమయింది.

## "స్వర్ణ"

బయట వెన్నెల పుచ్చపువ్వులా వికసిస్తున్నది. అందని అమృత స్రవంతిని చూస్తున్నట్టుగా వెన్నెల్లోకి చూస్తూ కూచుంది రాధ. కునుకు రాలేదు. మెదడులో ఆలోచనలు మండిస్తున్నాయి. ఆమె చిన్న బుర్రకు ఇంత చిచ్చు భరించరానిదిగా ఉంది. చిన్నప్పుడే వైధవ్యం, చెప్పుకోలేని బాధలు. మొండిగా బ్రతుకుతున్నది. అన్నయ్యా వదినా ఇద్దరూ సరదాగా ఉంటే వాళ్లను చూచి సంతోషించడం తన బ్రతుక్కి కొంచెం సరదా అనుకుంది. కాని వాళ్ళ బ్రతుకులు, సంతోషంగా గడవడం లేదేం? ఆలోచనలతో తెల్లవారింది. ఈ విషయం వదిన్నడిగి తెలుసుకోవాలి.

రాధ సరూకంటె చిన్నదే. చిన్నతనంలోనే సౌభాగ్యం బుగ్గయి రాధ జీవచ్ఛవంలా బ్రతకడం సరూకు ఎంతో జాలి కలిగించింది.

ఇద్దరికీ గాఢస్నేహం ఏర్పడింది. సమిష్టిగా తమ బాధల్ని మిళితం చేసుకుని ఊరడించుకునేంత దగ్గరగా రెండు హృదయాలూ కలిసేయి. బాధలున్న వాళ్లు ఎంతకాలం పెదిమల్లో ముడుచుకు ఉంచుకోగలరు!

* * *

భోజనాలయేయి. సరూ బావి పక్క చీకట్లో నక్షత్రాల్ని చూస్తున్నది. కళ్లల్లో నీళ్ళు తిరిగేయి. దుఃఖం లావాలా ఉబికింది. ముఖం ఎర్రనయింది, పొంగుకున్న దుఃఖాన్ని అణుచుకుని ఏడుస్తున్నది. రాధ వసికట్టి పక్కకు చేరింది. తొందరగా ఏమీ మాటాడలేకపోయింది. సరూ కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

"ఏడిస్తే ఏంలాభం వదినా..." ఓదార్చింది. "ఇంతకంటే చేసేదేముంది, ఆడదాన్నయ్యేక..." నిట్టూర్చింది సరూ.

"ఆగు. నేను మెల్లిగా అమ్మతో చెప్పి చూస్తానులే..."

"చెప్పేదేముంది రాధా." ముఖం కొంచెం బాధగా చిట్లించుకుంది.

"మరి,......" రాధ ఏదో అనబోయింది.

"మరింకేముంది చెప్పు, ఇంత హృదయంలేని వాళ్ళఇంట పడతానని కలలోనైనా అనుకోలేదు..." దుఃఖం ఇనుమడించింది. రాధ కీమాటలు బాధ కలిగించినా సరూకు దగ్గరగా కూచుంది.

"మీ నాన్నను చూడ్డానికి వెళ్ళుదూ గానిలే, ఉపాయం ఆలోచించకుండా ఏడుస్తూ కూచుంటే ఏం లాభం. మంచి ఆడదానివే..." కులాసాగా నవ్వింది రాధ "...మీ నాన్నకు మరో ఉత్తరం రాద్దాం. ఆయన కిప్పుడు కులాసాగానే ఉంటుందిలే, పద నిద్రపోదాం. అమ్మ చూస్తే మరీ లోకువగా ఉంటుంది..." ఇద్దరూ లేచేరు.

* * *

అన్నయ్య ఇంకా దీపంముందు పురుగులా పుస్తకం పుటలు తిప్పుతున్నాడు కుర్చీలో కూచుని. అమ్మా నాన్న కబుర్లు చెప్పుకుంటున్నారు అవతల గదిలో, వాళ్ళ బ్రతుకులో గడించిన లాభనష్టాల్ని లెక్కలు వేసుకుంటూ—

"ఈ బొక్క కొంప తప్పిందికాదు..."

"దీనికేం మా తాతలు కట్టించిన కొంప."

"ఉంటేం ఊడితేం, ముసలికొంప. రామానుజాలు చూడండి. ఎంత చక్కటి డాబా వేయించేడో, ఎండల్లో మేడ వేయిస్తాడట..."

"అతనికేం దేవాంతకుడు..."

"ఏదైనా కలిసి రావాలి...మనం ఎంత కొట్టుకు పుణుక్కుంటే మటుకు అయి తీరేదా..."

"రామానుజాలుకేం, ఉన్నవాళ్ళంతా మగవాళ్ళేగా. ముగ్గురికైన లు వరకూ లాక్కొచ్చేడు, ఒక్కొక్కడ్నే. కుర్రాడికి పదివేలు చొప్పున పోసి పుచ్చుకున్నాడు



"వెన్నెల కడిగిన దారుల
వెలసిన ముగ్గుల్లా" (రజని)

—చిత్రం: గోలి శేషయ్య.

పై చదువుల పూచీతోటి..., ఇల్లూ కడ తాడు, పొలాలూ కొంటాడు..."

"అవునండీ, పెద్దాళ్ళు ముగ్గురికీ రెండేసి ఎకరాలు పల్లం కూడా రాయించుకున్నాడు. అయినా అతని తెలివితేటలే వేరులెండి. భలే మంచి వ్యవహర్త..."

"మనవాడికోసం నేనేమన్నా తక్కువ ప్రయత్నం చేసేనంటావా?"

"అయినా పెద్దలు చెప్పనే చెప్పేరు, పది చెప్పులరిగేవరకూ తిరిగి మరీ జాగ్రత్తగా చేసుకోమని పిల్లల్ని. అయినా ఈ కట్నాల రోజు రోజుల్లో ఎంత బెట్టుగా ఉండవలసిందీ మనం మన వాడికోసం..."

"అయితే నేనేమన్నా తిరక్కుండా చేసేనంటావా, పోనీ నీ బుద్ధెక్కడికి పోయింది?..."

"ఆఁ... నేను మొదటే అన్నాను,... ఈ సంబంధం ఒద్దు మొర్రోమని. ఇంజనీరింగు పాసైన కుర్రాడికి పదిహేను వేలు, మూడెకరాలూ; ఇరవై వేలూ, నాలు గెక

రాలూ అని ఎగేసుకుని రోజు రోజు గుమ్మం మెక్కేవాళ్లను ఖాతరు చెయ్యక ఊబిలో పడ్డారేం కర్మం...?"

"సరే, ఇక ఏదో అయింది..."

"పీక తెగినంత అవమానం కాలేదు మరి? తాడూ బొంగరం లేని వెధవలికి హూత్ అంటే హాత్ అని వాలుతున్నారు వేలిస్తామని, మనకి నామర్దా కాదూ. ఏమంత తీసిపోయేడని ఈ సంబంధం కట్టేం? ఇంత ముదనష్టపు సంబంధాని కింత దూరమెందుకు, కలిసి కట్టుగా నా తమ్ముడు కూతుర్నే చేసుకోలేకనా..."

మూలకూర్చున్న సరూ చెవులు పెద్దవయ్యేయి. ఆ తమ్ముడి కూతుర్నే చేసుకుంటే బాగుండేదిగా! పళ్లు నొక్కుకుంది ఉక్రోషంతో. తారతమ్యాలు తెలీక, హృదయం లేని యంత్రంలా ప్రతినోరూ కట్నాలు అడగడం, పెళ్లంటే కట్నాలని అర్రు చాచడం ఏం మానవ నైజం? పౌరుషం కట్టలు తెగుతుంది. అత్తగారి మీదికి ఉరకాలని ఉద్రేకపడింది. రోజూ ఈ మాటలు వింటూ కుమిలేకంటే ముఖాన్న అడిగి బుద్ధి చెప్పాలి, నిరసిస్తే నాన్న దగ్గరకే పోయి స్వేచ్ఛగా బ్రతకాలనిపించింది. తల నిమురుకుంటున్న నరసింహాన్ని చూచేసరికి ఉద్రేకానికి మడత పడింది. అతని ప్రేమకోసం ఇంకా నిరీక్షించాలనే ఆశ మెదిలింది. ఆ ఇంట్లో తను ఓడిపోకూడదు. ఓరిమి స్త్రీజాతి ఆయుధం. సరూ ధైర్యంతో నిగ్రహించుకుంది.

"ఏం చేస్తాం డబ్బుపోసి చదివించినా ఫలం దక్కలేదు..." ముసలాయన కొంచెం ముక్కుకున్నాడు.

"అవి మన తెలివితేటలు లెండి ... ఇక ఏం చేస్తాం మరి.."

గదిలో నరసింహం ఉడికి నిప్పులు కక్కుతున్నాడు. శరీరం మీద జెర్రులు పాకుతున్నట్టుంది. కళ్ళల్లో నిప్పులు లేగుతున్నాయి. అవమానం అవహించి పీక్కు తిన్నట్టుంది. మిణుగురు పురుగులా నిలబడి ఉన్న సరూని ఒక్కసారిగా రాక్షసుల్లా నలిపేయాలనిపించింది. ఆమె వైపుకు చూడకుండానే ఆలోచిస్తున్నాడు.

మళ్లీ వినబడుతున్నాయి—

"వియ్యంకుడి కబుర్లకి బూరెల బుట్టలో పడ్డామనుకున్నారేం..."

"కాదు మరి, ఒక్కగానొక్క కూతురు. ఉన్నదంతా మన కొరుగుతుంది కదా అని.. పోనీ అదైనా దక్కుడు లే..."

"కట్నం మాట తేలవేయడం నాకు నచ్చలా" విదిలించుకు మరీ చెప్పిందావిడ.

"అంతే..."

"ఎంత భూమి వ్రాస్తానన్నా రూపాయిలు రూపాయిలే, అందర్లో ఘల్లుమని రూపాయిలు చదివించిన ఘనం వేరు. నిజానికి రూపాయిలకున్న విలువ, మోజా భూమికుందా. అసలు నగదు లేకుండా పెళ్లి అందమేమి ఏడిసిందని." సరూ కళ్లనుండి రక్తం ప్రవహించినట్టయింది. నోరు నొక్కుకుని ఏడ్చింది. మళ్లా ప్రారంభం.

"ఇప్పుడెందుకీ కబుర్లు. ఈ మాటలు అప్పుడు చెప్పలేకపోయేవ్..."

"అయినా నా పెత్తనం ఒక్క విషయంలో చెల్లిందా అని..."

"ఇక నన్ను చికాకు పెట్టకు. పిల్లదాని పెళ్లి నీ చేతులతో వెలగబెట్టేవుగా.. చెయ్యవలసిన పెత్తనం ఇక చెయ్యరాదూ..." ముసలాయన ముక్కుకున్నాడు.

"దాని కర్మ అలా కాలిందిగాని, ఎంత జాగ్రత్తగా ఆలోచించి చేసేను. ఈ రోజుల్లో పిల్ల ఎదిగిం తరవాత బోలెడంత కట్నాలు ధారబోసి చెయ్యగలిగేవారేమో పాపం..."

రాధకు పక్కలో బల్లెం గుచ్చుకున్నట్టు వినిపిస్తున్నాయి మాటలు. ఆడపిల్ల బరువుగా తోచింది. కట్నాలకి అర్రులు చాచి బాధ పెట్టడం, మరోవైపు ఆడపిల్లల్ని అంటు జాడ్యాల్లా వదిలించుకోడమే పుణ్యంగా, సంప్రదాయం పేరుతో గొంతుకలు కోయడం - ఏం చక్కటి ఆలోచనలు! గుండె తరిగినంతగా బాధపడింది. తల్లీ తండ్రీ ఇంత రాక్షసుల్లా ఎలా తయారయ్యేరా అని ఆలోచించింది. ఆ చిన్న బుర్రకు పెద్దాళ్ళ మూర్ఖపు ఆలోచనలు పిచ్చెత్తిస్తున్నాయి. మళ్ళీ తేనెటీగల పుట్టలా చెప్పుకుంటున్నారు—

"అయిందానికేం చేస్తాంగాని, ఆ ముసలాడికి సరిగ్గా ఎంత ఉన్నదీ కొస్త కరణం దగ్గర కెళ్లి వివరాలు చూచుకురండి..."

"ఉన్న దెక్కడికి పోతుంది..."

"ఏమో ఎవడికెరుక, ఉన్నదేదో దక్కకుండా పోతుంది ముందే మేలుకోకపోతే..."

పాపం వదిన వింటే ఎంత కుములుతుందో. గోరుచుట్టుమీద రోకటిపోటు. నాన్నకు జబ్బుగా ఉందని వచ్చిన ఉత్తరానికే ఏడుస్తోంది. పైగా వీళ్ల మాటలు...

నరసింహం చేతులో పుస్తకం బల్ల మీదికి జారబెట్టి లేచేడు. మూలనున్న ఉత్తరం కనిపించింది. ఎక్కణ్ణించి చెప్మా అని కంగారుగా తీసేడు. సరూ భయంగా నోరు విప్పింది - "ఉత్తరం వచ్చిందండి...మరిచిపోయా..." ముఖం ముడుచుకుని ఉత్తరం చూచేడు. నందకుమార్ వ్రాసింది. ఆత్రుతగా చదవడం ప్రారంభించేడు...

".. పెళ్ళికి రాలేకపోయినందుకు, నా దురదృష్టానికి విచారిస్తున్నాను. అనివార్య కారణాలు నీకు తెలుసు. క్షమిస్తావని నమ్ముతున్నాను. వధువు నీకు చాల తగి ఉన్నట్టు, నువు చాల అదృష్టవంతుడవని మన మిత్రులు, నాతో చెప్పారు..."

ఒక్కసారి అందరూ నరసింహానికి పూల మాలలు వేసినట్టుగా ఉంది. అంత మంచి పిల్ల భార్యగా దొరికినందుకు ఎంత గర్వం. ఒక్కసారి సరూవైపు మనసారా చూడాలనిపించింది. చూచేడు. సరూ భయంగా మిణుకు మిణుకుమంటూ చూస్తోంది, ఆరిపోతున్న దీపంలా. మళ్ళీ చదువుకున్నాడు "నేను తొందరలో తీరిక చేసుకుని రావాలనుకుంటున్నాను. ఎందుకో తెలుసా? వరకట్నాల నిషేధానికి మొదటివాడిగా నినాదాలు చేసిన మహానాయకుడివల్లా చాటుగా కట్నం పుచ్చుకున్నావని మనవాళ్ళంతా చెప్పేరు. నువ్వు నాతో ఈ విషయం ఇదివరకు సీరియస్‌గా పందెం వేసిన మాట మరిచిపోలేదని అనుకుంటున్నాను..." నందకుమార్ రాహువులా అడ్డంగా మాట్లాడుతున్నాడు. చటుక్కున ఉత్తరం మూసేసేడు. గుండె గుదికట్టినట్టనిపించింది. మంచం మీద ఒరిగి కళ్లు మూసేడు, బలవంతాన. అవతల గదిలో మాటలు ఇంకా వినిపిస్తున్నాయి.

"ఆ ముసలాడు ఎంత గడుగ్గాయి కాకపోతే చూడండి..."

"ఏమో..."

బహిష్టు
"దేవీ పిల్సు" (Regd. No CDL/688) ఏ కారణము వల్లనైనను, యెన్ని నెలలుగా ఆగిన బహిష్టును గ్యారంటీగా వెంటనే జారీచేయును. వేనకువేలు సేవించి తృప్తి పొందియున్నారు గ్యారంటీగల ఔషధము నకిలీ మందును వాడి మోసపోకండి ధర (Ordinary) రు. 8 8 0. కొన్ని నెలలుగా ఆగిన వాటికి (Special) రు 10 8 0 వి పి ప్రత్యేకము
గర్భనిరోధం
సంతానము కోరనివారికి. "స్పెక్ పిల్సు" (Regd No 2(6) 12 రోజులు సేవించిన శాశ్వతముగా 8 సం లకు గర్భము కలుగదు. బహిష్టు మామూలుగా వొస్తుంటారు. వేనకువేలు సేవించి తృప్తి పొందియున్నారు. గ్యారంటీగల ఔషధము.
ధర రు. 12-0 0 వి. పి. ప్రత్యేకము.
SEENU&COMPANY
POST BOX NO. 1638. MADRAS-1

"ఏమో, అని మట్టిబెడ్డలా ఉండబట్టే ఇలా జరిగింది..."

"అయితే, ఇక చేసేదేముంది.."

"ఇప్పుడేమైనా ఇంజనీరింగు చదివిన కుర్రాడికి కొంత కాకపోతే కొంతైనా గదు ఇవ్వమని అడిగి చూడండి, వాడి హోదాకి, పీక పోయినంత అగౌరవమని కూడా చెప్పండి. మరి కాదూ, వాడి తోటివాళ్లు అంతంత కట్నాలు తెచ్చుకుంటున్నారు. వాడుమట్టుకు తలెత్తుకు ఎలా తిరగ్గలడు. ఎవరైనా, మీ వాడికి కట్నమెంతిచ్చేరని అడుగుతుంటే నేనే బిక్కచచ్చిపోతున్నాను.. చూట్లాడలేం..."

"ఉన్న భూమి ఎలాగూ దక్కుతుందని రూపాయిల సంగతి ఎత్తుకోనే లేరుగ..."

"పోనీ ఇప్పుడన్నా అడగండి ఉన్నదంతా ఒంటిపిల్లి రాకాసిలా ఏం చేసుకుంటాడు. వచ్చిందే రావసం అడగండి. రామానుజుల్లాగ, ఈ బొక్కి కొంప కాస్తా దానా వేయించుకుంటే వాళ్లకే ఉంటుం నదిగా మీదటికి..."

"అయినా ఇప్పుడడిగితే బాగుండదేమో..." ముసలాయన నీళ్ళు నమిలేడు.

"ఏదో జబ్బుగా ఉన్నాను. కూతుర్ని చూడాలని ఉంది అని మరీ మరీ వ్రాసేడుగా. ముందు ఆవిడగార్ని తీసుకెళ్లనివ్వండి. తరవాత నల్లి అడుగుదురుగాని..."

నరసింహం తలగడలో తలదాచుకుని వింటూనే ఉన్నాడు. సరూకి దుఃఖం పొంగివచ్చింది. జబ్బుచేసిన నాన్నను చూచి రావల్సిందిపోయి ఆయనప్రాణంమీద వలగాటాలా! పమిటి నోటకుక్కుకుని ఏడ్చింది. నరసింహానికేం పాలుపోలేదు. బుర్ర తిచ్చి లేగింది. బలహీనంగా కూచుని ఎదురుగా ఏడుస్తున్న సరూ మరీ చులకనగా కనిపించింది - "నోరు మూసుకుని లే ప్రయాణంకట్టు ..." అని అరిచేడు, కోపంగా. పొంగిన ఉద్రేకంతో సరూమీదికి నడిచేడు. సరూ హీనంగా వెలుగుతున్న దీపపు శిఖలా చూస్తోంది. నరసింహంలోని ఉద్రేకం నీరయింది. సరూని చూడలేక కృంగిపోయేడు. రాధగొంతుక ఆత్రంగా వినిపించింది, అవతలినుండి, "వదినా" అని. నరసింహం మళ్ళీ. మంచంమీద వాలిపోయేడు నీరసంగా. సరూ అవతలికి నడిచింది.

రాధ వదినముఖంలోకి ఆత్రుతగా చూచింది. వాళ్ళిద్దరూ కళ్ళతో మాట్లాడుకున్నారు. కళ్ళతో ఓదార్చుకున్నారు. క్షణంలో సరూ మళ్ళీ అక్కణ్ణించి వెళ్ళిపోయింది. కదులుతున్న సరూని చూస్తూ కళ్ళనంట నీళ్ళు కార్చింది రాధ.

ఉదయం నరసింహం కాఫీ తీసుకుంటున్నాడు. సరూ విగ్రహంలా నిలబడి ఉంది. రాధ మెల్లిగా అక్కడికి చేరింది. నందకుమార్ ఉత్తరం మళ్ళీ ఒక్కసారి చూచేడు నరసింహం. పిడుగులా వచ్చేటట్టున్నాడు. ఇలాంటిపరిస్థితుల్లో వాడూ వస్తే! గుండెల్లో ముడతపడింది. పక్కనుండి రాధ మాటలు ధైర్యంగా ఉరికేయి.

"అన్నయ్యా..."

"ఏం!.." అని చీత్కారంగా ముగాళ్లా సమాధానం చెప్పేడు.

"రాత్రి ఎందుకన్నయ్యా అలా కేకలేస్తున్నావ్ వదినమీద...." ఒక్కగుక్కలో అడిగేసింది. సరూ నిర్ఘాంతపోయింది.

నరసింహానికి పిడుగుపాటయింది. చిన్నప్పట్నించి చెల్లెలు ఎప్పుడూ తనదగ్గరకు చేరలేదు. అమ్మా, నాన్న శిశువులో చెల్లెలికంటే తనకే పెద్దస్థానం ఇచ్చేరు. రాధకెప్పుడూ ఆ భయం ఉంటూనే వచ్చింది. మరి, ఇప్పుడింత అకస్మాత్తుగా ఎలా అడగ్గలిగింది? ఇలా అడుగుతుందని ఎప్పుడూ అనుకోనేలేదతను. ఛీ! ఈ పాడుపిల్ల కూడా నన్ను అడగాలేం, అని మగతనం బిరబిగిసింది. చెల్లెలిమీద కళ్లెరజేసి చూచేడు. పక్కనే సరూ ఉంది. రాధ జవాబుకోసం ఎదురుచూస్తున్నట్టు కళ్లు పైకెత్తి అమాయకంగా చూస్తోంది. మళ్లీ అతని ఉద్రేకం దెబ్బతింది. ఏమనాలో ఆలోచన తట్టలేదు. బయటికి జారుకున్నాడు.

ఆ రోజంతా ఎక్కడా స్థిమితం తోచలేదు. లొంగని ఉద్రేకం అతన్ని జీవచ్ఛవం చేసింది. తనకంటె చిన్నవాళ్లు రాధ, సరూ తన బలహీనతకు బుద్ధిచెప్పినట్టుగా బాధపడ్డాడు. వాళ్లా నన్ను ఎదిరించగలిగేది! నాలుగు తన్ను వచ్చుగా, అని మనస్సు కొంటెగా ఆలోచించింది. కాని తొందరలో తన అమానుష ఆలోచనలకు సిగ్గుపడాల్సి వచ్చింది. వాళ్ళ ముఖా లెలా చూచేది? ఒకప్పుడు నందకుమార్‌తో పోటీపడినందుకు ఎత్తిపొడిస్తే ఏం?.. వాడి ముఖం ఎలా చూడగలను? హోస్టల్లో ఉన్న నాలుగు సంవత్సరాలూ ఆదర్శాలు నంజుకుని, ఇంటికి రాగానే మూర్ఖత్వానికి దావడం మస్తిష్కానికి మలితనం పోలేదని బుజువవుతూనే ఉంది. రాధ చిన్నదైనా చురకవేయడంలో తప్పలేదు. మనస్సు చెంపలు వేసుకుంది. ఇల్లు చేరింతరవాత రాధ ముఖం చూడ్డానికే కష్టమనిపించింది.

* * *

మూగగా సరూ ముఖంలోకి చూచేడు నరసింహం. సరూకి అతని కళ్లల్లో పశ్చాత్తాపం కనిపించింది. కొంచెం ధైర్యంగా, ఆశగా చూచింది. నరసింహం కళ్ళల్లో ముగ్ధత్వం, ఆనందబాష్పాలు తిరుగుతున్నాయి. సరూ గుండెల్లో వెయ్యి మెరుపుల సంతోషం మెరిసింది. సరూ వ్యథలన్నీ మరిచిపోయి అతని కౌగిలిలో వాలిపోయింది—

"స.. రూ..." నరసింహం గొంతు సరికొత్తగా పల్లవించింది.

"ఏమండీ..." ఏదో అనేసి సిగ్గుపడింది సరూ.

ఇద్దరూ చాలసేపు కబుర్లు చెప్పుకున్నారు. అనేక విషయాలు దొర్లేయి—

"అంత చదువుకున్నవాళ్లకు నేనేం చెప్పగలను చెప్పండి..." నరసింహానికి తగిలింది సరాసరి.

ఓడిపోయిన ముఖం పెట్టి ఒప్పేసుకున్నాడు—"బూజు పట్టిన మస్తిష్కానికి విద్యాగంధం పైపూతేనని గ్రహించేఉంటా వీపాటికి..."

"విద్యాధికుల్లో ఉన్న తావర్యాలు కోరడంలో, తప్పేముందండి..."

"నేనేం చేయగలిగేను..." నీరసంగా అన్నాడు.

"మీ ప్రేమకు పాత్రత సంపాదించుకోగలిగాను..."

"నిజంగా...!"

"మరీ,..."

"మరేమిటి చెప్పబోయేది..."

"ఆఁ ఏం లేదు, రాధ మాటేం చేసేరు! మీరు కళ్లారా చూస్తూ..."

నరసింహం ఉక్కిరిబిక్కిరై తల నిమురుకున్నాడు. సరూ జవాబుకోసం చిరునవ్వు విసిరింది.

"సరే ఆలోచిద్దాం కొంచెం పెద్దసమస్యకదూ..."

"అన్నీ సమస్యలే మీకు, నన్ను రెండు కళ్లతో చూడ్డానికి ఇంతవరకూ మీకో సమస్యకాలా" సరూ కళ్ళతో బంధించింది. నరసింహం తప్పుచేసి దొరికిన అధికారిలా దొరికిపోయేడు.

"నందకుమార్, మంచివాడే...వాడితో ఎలా ప్రస్తావించేది..." అని గొణుక్కున్నాడు. ఇదివరకే తన్ని పిరికివాణ్ణిగా తేల్చేసుకున్నాడు. తనిక ఆదర్శాలగురించి, అందులో తన చెల్లెలుగురించి ప్రాధేయపడితే, స్వప్రయోజనాలకోసం ఆదర్శాలు చెమరువేసినట్టుంటుంది. పదవికోసం పార్టీలో చేరినట్టుంటుంది. ఎలాగూ? మనస్సు తికమకపడింది. సరూ ఎంతో ధైర్యం చెప్పింది.

# ★ జీవన రాగం ★

గుమ్మని ప్రసరిస్తున్న నైట్‌క్వీన్ పూల వాసనలు పీలుస్తూ అరుగుమీద కూచుని శూన్యంగా చీకటిలోకి చూస్తున్న రాధను ఇద్దరూ చూసేరు. ఇద్దరూ తొందరగా అరుగుమీదికి నడిచేరు—"ఏదేం రాధా! లోపలికి రా పడుకుందాం..." అని తట్టి లేపింది సరూ. రాధ అన్నయ్యను చూచి లేచి నుంచుంది.

"ఇంకా నిద్రపోలేదా రాధా..." అన్నయ్య ఎంతో ఆప్యాయంగా పిలిచేడు. రాధకు కొత్తసంతోషం మాలకు పూలు కూడినట్టుగా ఉంది. నరసింహం గదిలోకి వెళ్ళిపోయేడు. సరూ, రాధ హృదయాలు విప్పుకుని ఉన్న విషయాలన్నీ చెప్పుకున్నారు. సరూ కళ్లల్లో చాతుర్యానికి రాధ మురిసిపోయింది. రాధకు విరిదండలతో స్వర్గంలో ఊరేగినట్టుగా ఉంది. కళ్ళల్లో వెన్నెల కాస్తుంటే నిద్ర ఎలా పట్టేది? మళ్లీ వదినతో ఎప్పుడు కబుర్లు చెప్పుకుంటామా అని సంబరపడింది. చీకటి ఎంత తొందర్లో పోతుందా అని ఎదురుచూసింది.

"ఒరేయ్ నరసింహం..." అంటూ అమ్మ గదిలోకి వచ్చింది. సరూ కాఫీ ఇచ్చి నిలబడి ఉంది.

"ఇదుగో చూడు. ఈవిడ నాన్నకు మరి చాల జబ్బుగా ఉందటకదూ. చూడాలని ఉత్తరం వ్రాసేడు. ఈవిణ్ణి దిగబెట్టేసిరా. తరవాత నాన్న వెళ్తారులే చూడ్డానికి, ఆయనతో మాట్లాడిరావాలి కూడాను, కట్నం సంగతి అదీను..."

నరసింహం తల ఊపి సరేనన్నాడు.

ఇంతలో నాన్న కొడుకొక్కొచ్చిన ఎపాయింట్‌మెంట్ ఆర్డరు గంతులు వేసుకుంటూ కొడుకు చేతులో పెట్టేడు. నరసింహాన్ని విశాఖలో ఎలక్ట్రికల్ సూపర్‌వైజరుగా వేసేరు. సరూ స్వేచ్ఛగా నిట్టూర్చింది.

"అదృష్టవంతుడు వాడికేం, లక్షణంగా వందలు జీతాలు తెచ్చుకునేవాడికి అన్యాయంగా అంటగట్టేం కాని ఇలాటి సంబంధం......నరసింహం! ఆవిణ్ణి వదిలిపెట్టిరా, తరవాత ఏ సంగతీ మీ నాన్న చక్కబెట్టుకొస్తారులే..." గట్టిగా చెప్పి వెళ్లిందావిడ ఇంట్లోకి. నరసింహం కొయ్యబొమ్మలా విని సరూ వైపు చూచి ఒక్కసారి నవ్వేడు.

"మరి నన్ను విడిచిపెడుదురుగాని తొందరగా ప్రయాణం కానివ్వండి..." సరూ అంది. రాధ నవ్వింది.

* * *

"ఏమోయ్ మొన్న ననగా వస్తావనుకుంటే వారానికి వారమయింది. మీ మామగారు బాగున్నాడా..." నాన్న అడిగేడు.

"ఏదో సుస్తీచేసిందట. పెళ్ళికి చేసిన అప్పులబెంగ, అంతకంటే జబ్బేంలేదు... మందు తీసుకుంటున్నారు. ఇక కోలుకున్నట్టే. ఫరవాలేదు.."

"డబ్బుజబ్బులే. కూతురూ, అల్లుడూ, మాట మాటలా ఉండాలంటే ఎలా కుదురుతుంది. తరవాత విషయం నాన్న చూచుకుంటారులే నువ్వు ఇంటిదగ్గరే ఉండు.."

"ఊహూ, నేను తొందరగా వెళ్లాలి, రాధను తీసుకుని.."

"ఎక్కడికి?"

"ఉద్యోగానికి తొందరగా జాయిన్ కావాలి. వండిపెట్టడానికి రాధైనా లేకపోతే ఎలా చచ్చేది, అక్కడ."

"ఉద్యోగమూ మరోటూ పెళ్ళాంపోతే పెళ్ళాం వస్తుందిగాని ఈ రోజుల్లో...ఏ చింతా లేకుండా హాయిగా ఉండు. తొందరగా ప్రయాణం కట్టుమరి..."

రాధ అన్నయ్యతో ప్రయాణమయింది.

* * *

మల్లిఖార్జునం, పాండు, కృష్ణమూర్తి, సూరి నందకుమార్ చుట్టూ కూర్చున్నారు, సందడిగా కబుర్లు చెప్పుకుంటూ. నరసింహం హడావుడిగా లోపలునుండి వచ్చి - "అంతా రెడీ, వేళవుతోంది. తొందరగా టాక్సీలో కూచోండోయ్..." అంతా సద్దుమణిగింది. రెండు కార్లూ పరుగెత్తి గంటలో మళ్ళీ ఇల్లుచేరుకున్నాయి కొత్త వధూవరులతో. రాధ నందకుమార్, అందరికీ విందుచేసేరు. పాండు ఉండబట్టలేక పాడిచేడు,—"నందకుమార్ డిమాండ్ చెయ్యవోయ్ సింపుల్ కట్నం, ఓ నాలు గెకరాలు; ఛీ! డబ్బెందుకులే..." అందరూ నవ్వేరు.

నరసింహం అందర్లో సిగ్గుపడుతూనే నవ్వేశాడు. మల్లిఖార్జునం "..నిన్ను చూస్తుంటే మాకందరికీ జాలిగా ఉందిరా భాయీ..." అందుకున్నాడు. అందరూ గొల్లున నవ్వేరు.

సరూ రాధ నరసింహం చెవిలో ఏదో మాట్లాడేరు—

"ఉత్తరం వ్రాసేను. ఈరోజు మామగారు అత్తగారూ వస్తారనుకున్నాను. బహుశః ఈ బండికి రావచ్చుండి..." సరూ అంది.

"తొందరే మొచ్చిందని ఉత్తరం వ్రాసేవు" నరసింహం పిరిగ్గా విసుక్కున్నాడు. సరూ మెల్లిగా నవ్వింది, పరిహాసంగా.

"పదండోయ్, అందరం స్టేషనుకు వెళ్దాం" నందకుమార్ అన్నాడు.

"తప్పకుండా, ఆలస్యమెందుకూ, ఇక రైలు వేళయింది. ముసలాళ్ళను ఆహ్వానిద్దాం మన కొత్త ప్రపంచానికి..." పాండు లేచేడు.

అందరూ స్టేషనులో ఎదురుచూస్తున్నారు. రైలు వచ్చింది. సరూ నాన్న దిగి అందర్నీ చూసేడు. వధూవరుల్ని ఆశీర్వదించేడు. అన్నిపెట్టెలూ వెదికి చూచేరు, సరూ, నరసింహం.

"ఎక్కడోయ్ మీ నాన్న, అమ్మా?" నందకుమార్ అడిగేడు.

"రాలేదే" అనుకుంటూ దిక్కులు చూచింది రాధ.

"అవును, ఇక వాళ్లు రాలేరులే..." అని నరసింహం అందర్నీ చూచి స్టేషనవతలికి నడిచేడు. ★

సంపూర్ణ శరత్ సాహిత్యం
40 పుస్తకాలలోనూ..
14 సంపుటములుగానూ..
వెలువడినాయి / వివరాలకు ....
దేశకవితామండలి. విజయవాడ 2

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యమునకు బలమునకు
ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్, మదరాసు - 17.